కడప నగర శివార్లలోని 919/1 సర్వేనెంబరులో కొండలున్నాయి. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు 3.762 హెక్టార్లలో గనులశాఖ అనుమతి ఇచ్చింది. వైసీపీ హయాంలో మాజీ ముఖ్య నేతల బంధువులే బినామీ పేర్లతో కొండను కొల్లగొట్టారు. అనుమతుల లేకుండా ఇష్టారాజ్యంగా కావాల్సిన చోట కొండను తవ్వి గ్రావెల్ అమ్మి రూ.కోట్లు సంపాదించారు. అప్పట్లో ఇక్కడ గ్రావెల్ తవ్వకాలపై టీడీపీ నేతలు కూడా పలు ఆరోపణలు చేశారు. గ్రావెల్ తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ టీడీపీ నేతలు గొంతు చించుకున్నారు. సీన్ కట్ చేస్తే టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడునెలలు అయింది. అయితే వైసీపీ దారిలోనే ప్రస్తుతం టీడీపీ నేతలూ వెళుతున్నారు. ఎన్నికల ముందు, తర్వాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వైసీపీ బ్యాచ్.. జనం ఛీఛీ అనేలా అక్రమాలకు పాల్పడుతోంది.



చిన్నచౌకు సర్వే నెంబరు 919/1లో జరుగుతున్న మట్టి తవ్వకాలు

దర్జాగా దోపిడీ



చిన్నచౌకు సర్వే నెంబరు 919/1లో మట్టి తరలించే వాహనాలు వెళ్లేందుకు కొండను తొలచి ఏర్పాటు చేసిన దారి

- గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఒక చోట.. తవ్వేది మరో చోట
- ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా..
- వైసీపీ నేతల అడుగుజాడల్లో దందా
- వివాదాస్పదంగా వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారి తీరు
- పార్టీకి చెడ్డపేరు వస్తుందంటూ తెలుగు తమ్ముళ్ల ఆవేదన

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గాలి తప్ప అన్ని వనరులను కబ్జా చేశారు. ముఖ్యంగా ల్యాండ్, శాండ్, గ్రావెల్ ఇలా.. అన్ని వనరులను అడ్డంగా దోచేసుకున్నారు. ప్రకృతిని నాశనం చేస్తే దేవుడు సహించడంటారు. అలాగే ఓటు వేసి గెలిపించిన జనం ఆకాంక్షలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా సరే.. వారి భరతం పట్టేందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తుంటారు. ఐదేళ్లకే వైసీపీ ఘోర ఓటమి ఎవరికైనా పాఠం లాంటిది. అయితే కూటమిలోని టీడీపీ నేతలు కూడా వైసీపీ బాటలోనే నడుస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకుని వైసీపీ వారు అడ్డగోలుగా సంపాదించిన తీరునే ఆదర్శంగా తీసుకున్నారు. అది కూడా.. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నవారు కాదు.. ఆయారాం గయారాంలుగా తయారై ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరేవారు. నిన్నటిదాకా వైసీపీలో అవినీతికి పాల్పడినవారు.. ఇప్పుడు టీడీపీలో చక్రం తిప్పుతున్నారు. అనుమతులు ఓ చోట తీసుకుని మరో చోట తవ్వడం యథేచ్ఛగా సాగుతోంది. కడప సమీపంలోని నానాపల్లెలో గ్రావెల్‌ను వైసీపీ నేతలకు మించి దోపిడీ చేయడమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

అనుమతులు 3.762 హెక్టార్లలో మాత్రమే..

కడప నగర శివార్లలోని చిన్నచౌకు రెవెన్యూ పొలం ఆర్‌కే నగర్ సమీపంలో నానాపల్లె వద్ద కొండలున్నాయి. ఇవి ఆర్‌కేనగర్, వైఎస్ఆర్ లేఅవుట్‌కు ఆనుకునే ఉన్నాయి. ప్రభుత్వ అనుమతుల మేరకు తవ్వుకోవడాన్ని ఎవరూ తప్పుబట్టరు. వైసీపీ హయాంలో ముఖ్యనేత బంధువులే కొండను కొల్లగొట్టారంటారు. అనుమతి లేకుండా దోచేశారని విమర్శ ఉంది. ఇప్పుడు అదే సీన్ రిపీట్ అయింది. జిల్లాలో ఏడుచోట్ల మాత్రమే గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఉన్నట్లు భూగర్భగనులశాఖ అధికారులు లీజుదారులకు వివరాలు ఇచ్చారు. ఇందులో కడప, ఖాజీపేట, వేంపల్లె, పోరుమామిళ్లలో మాత్రమే గ్రావెల్ తవ్వకాలకు అనుమతులున్నాయి. కడపలో చిన్నచౌకు సర్వేనెంబరు 919/1పీలో 1.762 హెక్టార్లులో జి.చెన్నారెడ్డి లీజుదారుడు. ఈయనకు ఈ ఏడాది జూన్ 9వ తేదీ వరకు అనుమతి ఉంది. ప్రస్తుతం ఇక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. అలాగే సర్వేనెంబరు 919/1లో పి.రామక్రిష్ణారెడ్డికి రెండు హెక్టార్లలో అనుమతులు ఉన్నాయి. ఈయనకు ఈ ఏడాది అక్టోబరు 27వ తేదీ వరకు అనుమతి ఉంది. నానాపల్లె సమీపంలోని కొండల్లో వీరిద్దరికి మాత్రమే గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి.

అడ్డగోలు తవ్వకాలు

గ్రావెల్ తవ్వకానికి క్యూబిక్ మీటరుకు ప్రభుత్వానికి రూ.125 చెల్లించాల్సి ఉంది. ఒక ట్రాక్టరుకు 3 క్యూబిక్ మీటర్లకు గాను రూ.375, టిప్పరుకు 15 క్యూబిక్ మీటర్లుకు గాను రూ.1,750 ప్రభుత్వానికి చెల్లించాలి. ఇక లీజుదారుడు గ్రావెల్ తవ్వి టిప్పరు, ట్రాక్టరుకు ఎక్సకవేటరుతో లోడు చేసేందుకు అదనంగా రూ.500 తీసుకుంటాడు. ఇక రవాణా చార్జీల కోసం 6కి.మీ లోపు ఉంటే రూ.1500, 6 నుంచి 10 కి.మీ వరకు రూ.2వేలు తీసుకుంటారు. వీటితో పాటు అదనంగా లీజుదారుడు లాభం కోసం ట్రాన్స్‌పోర్టుపై రూ.500 తీసుకుంటాడు. నిబంధనల ప్రకారం అయితే ఇలానే జరుగుతుంది. అయితే ఇప్పుడు వైసీపీ నుంచి వలస వచ్చిన టీడీపీ బ్యాచ్ ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండానే ఇష్టారాజ్యంగా కొండను గుల్లచేసి రోజూ లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. నానాపల్లె సర్వే నెం.919/1లో కాల్వ దేవాలయం వద్ద.. ఇప్పుడు కడప టీడీపీలో తానే పెద్ద కింగ్ అని ప్రచారం చేసుకుంటున్న పాతకడపకు చెందిన ఓ నేత అడ్డగోలుగా తవ్వుతున్నాడు. అదే సర్వేనెంబరులో గత వైసీపీ హయాంలో ఇచ్చిన జగనన్న లేఅవుట్ వద్ద అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. లీజు వద్ద కాకుండా వేరే చోట తవ్వుతున్నారు. లీజుదారుడు 15 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ పట్టే టిప్పరుకు రూ.1,750 ప్రభుత్వానికి చెల్లిస్తే.. ఈ బ్యాచ్ మాత్రం పైసా చెల్లించకుండా అధికారం అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. లీజుదారుడు 15 క్యూబిక్‌మీటర్ల గ్రావెల్‌ను కడపలోని ఆర్టీసీ బసాండు వద్దకు రూ.5,500కి తోలుతారు. అయితే వైసీపీ నుంచి వచ్చిన బ్యాచ్ రూ.3,500కే తోలుతున్నారు. వీరు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించడం లేదు. నానాపల్లె నుంచి అడ్డగోలుగా తవ్వుకుని అమ్ముకుంటున్నారు. ఈవిషయాన్ని ఆంధ్రజ్యోతి కడప తహశీల్దారు నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అనుమతి లేకుండా తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.









మాట్లాడుతున్న డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు



దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చేతన ఫౌండేషన్, బార్డిలై సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో సుమారు 60 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా దివ్యాంగుడనని, క్యాన్సర్‌తో కుడిచేయి కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో ఉద్యోగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించానన్నారు. దివ్యాంగులు ఆత్మన్యూనతకు లోను కాకుండా అనుకున్నది సాధించాలన్నారు. వికసిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ గతంలో కూడా చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా స్వయం ఉపాధిలో భాగంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశామని, కబడ్డీ పోటీలు నిర్వహించామని తెలిపారు. అలాగే శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్వీ కృష్ణకిషోర్, ఎన్‌వైకే అధికారి మణికంఠ, చేతన ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేశ్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, ట్రస్ట్ చైర్మన్ జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోండి

- టీచర్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి
- టీడీపీ గ్రీవెన్స్‌లో ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

అమరావతి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి అనుచిత వైఖరితో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. డీఈవో తీరుపై విచారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత నాలుగేళ్లుగా పాఠశాల విద్యాశాఖలో అంతర జిల్లా బదిలీలు జరగకపోవడంతో తాము కుటుంబాలకు దూరంగా ఉండి పనిచేయాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు వాపోయారు. తమను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అర్జీలు స్వీకరించారు. కారుణ్య నియామకం కింద వీఆర్ఏ ఉద్యోగం పొందిన తన చెల్లిని, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తనను టీడీపీకి అనుకూలంగా ఉన్నామన్న కక్షతో గత ప్రభుత్వం తొలగించిందని, ఆ ఉద్యోగాలను తిరిగి తమకు ఇప్పించాలని అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి కస్పాకు చెందిన ఎం.శ్రీనివాసులు వేడుకున్నారు. కడప డీఈవో తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమెపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు కోరారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా నిత్యానంద రాజులు



కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నిత్యానందరాజులు నియమితులయ్యారు. శుక్రవారం కడప నగరం సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనను బదిలీపై సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం యాన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ప్యాసింజర్లతో లబ్ధిదారురాలు



ఆటో సారథులుగా.. మహిళలు

- అదనపు ఆదాయంతో జీవనోపాధులు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

6



బస్టాండు కిటకిట



పాఠశాల విద్యార్థులకు, జూనియర్ కళాశాలలకు సంక్రాంతి శెలవులు ప్రకటించారు. దీంతో కడప బస్టాండులో ఒక్కసారిగా రద్దీ పెరిగిపోయింది. హాస్టళ్ల నుంచి ఇళ్లకు పోయేవారు, సొంతూర్లకు వెళ్లేవారితో బస్టాండు కిటకిటలాడింది. ఆర్టీసీ సైతం సంక్రాంతిని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేసింది. అయినా సరే.. ఏ బస్సు వచ్చినా క్షణాల వ్యవధిలో నిండిపోయింది. ఎంత రద్దీ ఉన్నప్పటికీ అందరిలోనూ సొంతూర్లకు పోతున్న ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపించింది.

- కడప మారుతీనగర్



కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

- అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు




కడప క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య మరియు కడప జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన కడపలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలైన కోడిపందాలు, పేకాట, గుండాట, చక్కాబొమ్మ ప్రజల జీవితాలను నాశనం చేస్తాయన్నారు. ఎక్కడైనా కోడి పందాలు ఆడినా, జూదం ఆడినా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసుస్టేషన్‌లో కానీ డయల్ 100 లేదా 112కు ఫోను చేసి సమాచారం తెలపాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అప్పు చెల్లించలేదని వడ్డీ వ్యాపారి దాడి


6

ఉత్తర ద్వారం.. వైకుంఠ మార్గం

- హరి నామస్మరణతో మార్మోగిన వైష్ణవ ఆలయాలు



పులివెందులలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



దేవుని కడప ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజాము నుంచే లక్ష్మీ సమేత శ్రీమన్నారాయణుడిని దర్శించుకునేందుకు ప్రజలు బారులుతీరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గడ్డిబజార్‌లోని సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శ్రీలక్ష్మీనారాయణ సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలంఖాన్ పల్లెలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున కుటుంబాలతో కలిసి తరలివచ్చారు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో భక్తులతో కిటకిటలాడింది.



ఉత్తరద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



దేవుని కడపలో భక్తుల రద్దీ

టీడీపీ హయాంలోనే ప్రాధాన్యత

● రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం



పీలేరులో జరిగిన అభినందన సభలో మాట్లాడుతున్న సదాశివం

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణు లకు రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాధాన్యత దక్కిందని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. పీలేరు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయిబ్రాహ్మణుల పేద పరిస్థితులను చూసిన దివంగత సీఎం ఎన్టీఆర్ 1989లో ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, తదనంతర కాలంలో సీఎం చంద్రబాబు దాన్ని కార్పొరేషన్‌గా మార్చారన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది నాయీబ్రాహ్మణులు అటు వృత్తి, ఇటు వ్యక్తిగత జీవితాల్లో ఎంతో అభివృద్ధి చెందారన్నారు. టీటీడీ పాలకమండలి లోనూ ఇద్దరు నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత చంద్ర బాబుకే దక్కిందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ సర్కారును బీసీలను పూర్తిగా విస్మరించిందని, పేరుకు 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలిపోయా రన్నారు. అనంతరం ఆయనను స్థానిక నాయకులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.మల్లిఖార్జున, మాజీ ఎంపీపీ మహితా ఆనంద్, పీలేరు సంఘం అధ్యక్షుడు ఎర్రయ్య, సభ్యులు రాజగోపాల్, ఆంజనేయులు, రమేశ్, గిరి, వాణి, వెంకటరమణ, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ


అవగాహన కల్పిస్తూ మానవహారంగా ఏర్పాటు చేసిన దృశ్యం

సంబేపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు డివిజినల్ మోడల్ మేకింగ్ ట్రైనర్ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం రౌతుకుంట రైతు పీరుసాబ్ పొలంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం భవిష్యత్ తరాలకు ఒక దివ్య ఔషధమని, యువత వారికున్న సమయంలో వ్యవసాయానికి కూడా కొంత భాగం కేటాయిస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు పెట్టుబడులు తగ్గిస్తూ మంచి ఆహార ఉత్పత్తులు మానవాళికి అందించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ మండల సిబ్బంది, ఐబీఐసీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మాస్టర్ ట్రైనర్ మానస, ఎన్‌ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

● జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి

నందలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం రివ్యూ మీటింగ్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నందలూరు, పాటూరు పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టీడీపీ నాయకులు మోడ పోతుల రాము తదితరులు పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

ఆటో సారథులుగా.. మహిళలు



● అదనపు ఆదాయంతో జీవనోపాధులు

● ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అవని నుంచి ఆకాశం వరకు అన్నింటా తాము ఉంటామంటూ పోటీపడుతున్న అతివలు వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుంటూ మెరుగైన జీవనోపాధుల వైపు దూసుకెళ్తున్నారు. ఆటో సారథులుగా సైతం మహిళలు రాణిస్తున్నారు. ప్రభుత్వాలు వారిని ప్రోత్సహిస్తూ చేయూతనిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఉత్సాహమున్న మహిళలకు తాము ఎంచుకున్న వ్యాపారంలో రాణించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో 12 మందికి ఆటోలు ఇప్పించారు. వీటిని స్వయంగా మహిళా సభ్యులు నడుపుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ద్వారా ఆటోలు అందజేశారు. 8 మంది ఎస్సీలు, నలుగురు ఎస్టీ మహిళలు లబ్ధిపొందారు. ఇందుకోసం రూ.35,28,770 ఖర్చుచేశారు. ఇందులో రూ.31,41,228 రుణం అందించగా రూ.3,85,949 లబ్ధిదారుల వాటాగా వసూలు చేశారు. లబ్ధిదారులు ఆటోకోసం పొందిన రుణం పూర్తిగా వడ్డీ లేకుండా 48 కంతుల్లో తిరిగి చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించారు. లబ్ధిపొందిన వారిలో ప్రొద్దుటూరు మండలం లింగాపురంలో ఇద్దరు, ఒంటిమిట్ట మండలం యానాది గ్రామ సమాఖ్యలో ఇద్దరు గిరిజన మహిళలు ఉండగా.. ప్రొద్దుటూరు, వల్లూరు, పులివెందుల, సిద్దవటం, పెండ్లిమర్రి మండలాలకు చెందిన ఎనిమిది మంది దళిత మహిళలు ఉన్నారు.


ఆటోల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ విజయరామరాజు (ఫైల్)

అదనపు ఆదాయంతో జీవనం

లబ్ధిదారులు తాము స్వయంగా ఆటోలు నడుపుతూ కుటుంబానికి అదనపు ఆదాయం సమకూరుస్తుండటంతో మెరుగైన జీవితం సాగిస్తున్నారు. పెండ్లిమర్రి మండలానికి చెందిన ఒక లబ్ధిదారు యోగివేమన యూనివర్సిటీకి అవసరమైన కూరగాయలు తీసుకురావడంతో పాటు స్థానికంగా ప్యాసింజర్లను చేరవేస్తున్నారు. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పొలం పనులకు కూలీలను తీసుకెళ్లడం, అక్కడే వారితో పాటు వ్యవసాయ పనులు చేయడంతో ఒకవైపు ఆటో బాడుగ మరోవైపు కూలీ డబ్బులు సంపాదించే అవకాశం రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో మహిళ తాను స్కూల్ పిల్లలను తీసుకొని వెళ్లడం, మధ్యాహ్నం భోజనం క్యారియర్లు తీసుకొని వెళ్లడం వల్ల పనిదొరికిందని.. దీంతో కుటుంబానికి ఎంతో ఆసరా దొరికిందని అంటున్నారు.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి సాధిస్తుండడంతో ఆ సంఘాల్లోని సభ్యులను ప్రభుత్వాలు మరింత ప్రోత్సహిస్తున్నాయి. సభ్యుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాలలో వ్యాపారం చేసుకుని మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు తీసుకుంటోంది. దీంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు చిరు వ్యాపారం నుంచి పరిశ్రమలు ఏర్పాటుచేసే స్థాయికి ఎదుగుతున్నారు. 50కి పైగా సంఘాలకు రూ.100 కోట్లకు పైగా ఆర్థికసాయం అందించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంఘాల్లోని ఒక్కొక్క సభ్యురాలికి వారు ఏర్పాటుచేసే పరిశ్రమను బట్టి రూ.10లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఆర్థికసాయం అందిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు కూడా తాము పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లించి నమ్మకాన్ని ఏర్పరచుకోవడంతో కోరినంత రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు.

పేదరిక నిర్మూలన కోసం చర్యలు

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ



స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘంలోని ప్రతి మహిళకు ఏదో ఒక పథకం ద్వారా ఆర్థిక లబ్ధిచేకూర్చి వారికి మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించడం కోసం చర్యలు తీసుకుంటున్నాం. సెర్ప్ ఆదేశాలకు అనుగుణంగా, మహిళా సంఘాల్లోని సభ్యుల ఆసక్తిని బట్టి వారి జీవనోపాధికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చుతున్నాం.

బడి పిల్లలను తీసుకెళ్లడం వల్ల ఉపాధి

- లత, ఉన్నతి లబ్ధిదారు, ప్రొద్దుటూరు



నేను స్వయం సహాయక సంఘంలో చేరిన తర్వాత పొదుపు చేసుకోవడంతో పాటు చిన్నచిన్న మొత్తాల్లో రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లించేదాన్ని. 10వ తరగతి వరకు చదువుకున్న నేను ఆటో డ్రైవింగ్‌లో కూడా ప్రావీణ్యం పొందాను. డీఆర్‌డీఏ, వెలుగు వారు రుణం కింద ఆటో ఇప్పించారు. దాని ద్వారా సంపాదించుకుంటూ మెరుగైన జీవనం సాగిస్తున్నా. ఇళ్ల వద్ద నుంచి బడి పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం ద్వారా ఉపాధి లభించింది. ఖాళీ సమయంలో బాడుగలకు వెళ్లడం, ప్యాసింజర్లను తీసుకెళ్లడంతో అదనపు ఆదాయం వస్తుంది. నెలకు దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేలు సంపాదించుకుంటున్నా. ఆటోకు నెలవారీ కంతుపోను మిగిలిన సొమ్ముతో కుటుంబపోషణ చేసుకుంటున్నా.

పేదరికం నుంచి బయటపడుతున్నా

- వెంకటసుబ్బమ్మ, లబ్ధిదారు, నందనగర్, ఎస్టీ కాలనీ, ఒంటిమిట్ట



నేను కూలి పని చేసుకుంటూ, అడవిలో గడ్డలు ఏరుకుంటూ అతిపేదరికంలో జీవనం సాగించేదాన్ని. తర్వాత పొదుపు సఘంలో చేరాను. ఆ సంఘం ద్వారా నెలనెల పొదుపు చేసుకుని బ్యాంకులో లోన్ పొంది సక్రమంగా చెల్లించాను. దీంతో తిరిగి బ్యాంకులోన్ తీసుకుని మేకలు పట్టుకుని జీవిస్తూ ఉండేవాళ్లం. తర్వాత వెలుగు అధికారులు ఆటో లోన్లు వచ్చాయని చెప్పారు. నేను టెన్త్ వరకు చదువుకున్నాను. మా గూడెంలో వేరే వాళ్ల వద్ద ఆటో నేర్చుకుని లోనుకు అప్లయ్ చేసుకున్నాను. రూ.2,70,000 ఉన్నతి లోన్ మంజూరైంది. ప్రతినెల రూ.6వేలు కంతు చెల్లిస్తున్నాను. ఆటో నడపడం వల్ల జీవనోపాధి మెరుగుపడింది. నా పిల్లల చదువు అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి.

బంకుల విషయమై గుర్రంకొండలో ఉద్రిక్తత...!

● ప్రభుత్వ స్థలం ఆక్రమణ


బంకుల విషయమై ఘర్షణ పడుతున్న యువకులు

గుర్రంకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ స్థలంలో అక్రమంగా రేకు బంకులను ఏర్పాటు చేస్తుండడంతో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. వందలాది మంది యువకులు ఓ చోట గుమికూడి బంకుల ఏర్పాటును అడ్డుకోవడంతో కొంత సేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోవడంతో సర్దుమనిగింది. పట్టణ నడిబోడ్డున బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ ఉంది. ఇవి శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు అక్రమించుకొని కబ్జాకు యత్నించారు. అప్పట్లో జిల్లా అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లడంతో అలానే వదిలేశారు. ఈ క్రమంలో కొంత స్థలంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఈ స్థలం 2 కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలంలో కొందరు నాయకులు రేకుల బంకులను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ రేకులషెడ్డులను ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయరాదంటూ అదే వర్గంలోని వందలాది మంది యువకులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అల్లరిమూకలను తరిమేశారు. అధికారుల అనుమతులు లేకుండా ఎటువంటి బంకులను ఏర్పాటు చేయకూడదని పోలీసులు సూచించారు.

అప్పు చెల్లించలేదని వడ్డీ వ్యాపారి దాడి


తీవ్రంగా గాయపడిన మోహన్ రావు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 10(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించ లేదని పట్టాణానికి చెందిన మారెళ్ల మోహన్ రావుపై వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు శుక్రవారం దాడి చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. తాను వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు వద్ద కొంత నగదును తీసుకు న్నానని, వ్యాపారపరంగా నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డబ్బులు చెల్లించాలని వేధించే వాడన్నారు. డబ్బులు ఇచ్చేందుకు కొంత సమయం కావాలని వేడుకున్నా వినకుండా రెడ్డివారిపల్లి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి పిలిపించి డబ్బుల విషయంగా చర్చిస్తుండగా తనపై మద్యం బాటిల్‌తో దాడి చేశాడని ఆరోపించారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాయపడిన బాధితుని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

ఆక్రమణదారుల నుంచి మా భూమి ఇప్పించండి మహాప్రభో


రైతు పత్తి సుబ్బరాయుడు

ఓబులవారిపల్లె, జనవరి 10: మండల పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామ రెవెన్యూ పరిధిలో తమ భూమిని ఆక్రమించి దౌర్జన్యాలు చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని బాధితుడు పత్తి సుబ్బరాయుడు వాపోతున్నాడు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. మండల పరిధిలోని చెన్నరాజుపోడు రెవెన్యూ పరిధిలో తనకున్న భూములకు సంబంధించి ఒక ఎకరా 75 సెంట్లు భూమి ఆక్రమణకు గురైందని, తమ భూమిని తమకు ఇప్పించండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోలేదని రైతు సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న భూమిలో 10 ఎకరాల 80 సెంట్లు గతంలో విక్రయించానని, సదరు భూమి కొన్న వ్యక్తి తాము లేని సమయంలో 12 ఎకరాల 55 సెంట్లు భూమిని అక్రమంగా దౌర్జన్యంగా ఆక్రమించారని కన్నీటిపర్యంతమయ్యారు. అప్పటి నుంచి అనేకసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చినా, భూమి కొలతలకు చలానాలు కట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేసినప్పటికి స్థానిక అధికారులు పట్టించుకోలేదని లబోదిబోమంటున్నాడు. గతంలో పొలం దగ్గరకు వెళితే తనపై దౌర్జన్యాలు, హత్యాయత్నం కూడా చేశారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి మండల రెవెన్యూ సర్వేయర్‌తో కొలతలు వేయించి తమ భూమిని తమకు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

21న ఏకసభ్య కమిషన్ పర్యటన

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈ నెల 21న జరగనున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కమిషన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం పీలేరులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వాటి అనుబంధ సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నమాదిగ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా షెడ్యూల్ కులాలలోని 59 ఉపకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ లభించే అవకాశం దక్కిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ (ఏకసభ్య కమిషన్) ఈ నెల 21న చిత్తూరుకు రానుందన్నారు. ఆ రోజున పీలేరు నియోజకవర్గంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున చిత్తూరుకు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు అమరాల వెంకటరమణ, చరణ్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి, విశ్వనాథ, నాగేశ్వరరావు, మహేశ్, రమణ, శ్రీరాములు, నాగరాజ, రెడ్డమ్మ, మాధవి, సుగుణ, నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు

ఆహా.. ఏమి రుచి..!






ఆకలి రుచి ఎరుగదని పెద్దలు అంటుంటారు. అది మనిషి అయినా.. పక్షి అయినా.. జంతువైనా.. ఆకలి అందరికీ ఒక్కటే. ఈ కోవలోనే ఓ రామచిలుక ఆకలి బాధ తాళలేక ఓ చెట్టుకు ఉన్న మొగ్గను తన నోటితో కొరుకుతూ కనిపించింది. సాధారణంగా రామచిలుక జామపండ్లు, మామిడిపండ్లు, తదితర పండ్లను తింటూ ఉంటుంది. కానీ ఆహారం కోసం ఎక్కడెక్కడ తిరిగిందో కానీ ఏదీ దొరక్క చివరకు అవిసె కొమ్మకు ఉన్న మొగ్గను ఆస్వాదిస్తూ 'ఆహా.. ఏమి రుచి.. తినరా మైమరిచి' అని లొట్టలేసుకుంటూ తినింది. చింతకొమ్మదిన్నె మండలం, బాలుపల్లె వద్ద ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

లింకులు క్లిక్ చేస్తే... ఖాతా ఖాళీ

- కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు
- జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ఫిర్యాదులు
- రూ.22 కోట్లకు పైగా దోచుకున్న కేటుగాళ్లు



కడప(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు మితిమీరి పోతున్నారు. ప్రజలు ఎంత జాగ్రత్తగా వున్నా కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం అందరి చేతుల్లో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో ప్రతి కోనుగోలు, అమ్మకాల్లో చెల్లింపు డిజిటల్ విధానంలో చేపడుతున్నారు. ఫోన్‌పే, గూగు ల్‌పే, పేటీఎం, తదితర యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. అవన్నీ ప్రైవేట్ సంస్థలే అందువలనే మన సమాచారం అంతా వారి చేతిలో ఉన్నట్లే. ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. కొందరు అత్యాశ కారణంగా ఈజీ మనీ కోసం కొన్ని యాప్‌లను క్లిక్ చేస్తూ మోసపోతున్నారు.

ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి ఫోన్‌కు లింకును పంపించారు. లింకును క్లిక్ చేయడంతో లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నాడు. కడపకు చెందిన యువకుడు కూడా ఫోన్‌లో లింకును క్లిక్ చేయడంతో బ్యాంకులో ఉన్న డబ్బు కాజేశారు సైబర్ నేరగాళ్లు ఇలా జిల్లా వ్యాప్తంగా ఎందరో బాధితులుగా ఉన్నారు. మోసపోయిన వారిలో ఎక్కువగా విద్యావంతులు, ఉద్యోగులు ఉండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 13 నెలల్లో వెయ్యికి పైగానే ఫిర్యాదులు ఉన్నాయంటే సైబర్ నేరగాళ్ల చేతిలో ఎంతగా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. దాదాపు రూ.22కోట్లకు పైగానే డబ్బు పోగొట్టుకున్నారు.

ఆశపరులే టార్గెట్

కొందరికి డబ్బులు వస్తాయంటూ అందుకు సంబంధించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఆశపరులనే టార్గెట్ చేసుకుని లింకులను పంపిస్తారు. కొన్ని గేమ్స్‌కు, వర్క్ ఫ్రమ్ హోం, ఉద్యోగాలు లాంటి వాటికి సంబంధించి లింకులను పంపిస్తారు.. ఆ లింకులను క్లిక్ చేయగానే.. సైబర్ నేరగాళ్లు క్షణాల్లో బ్యాంకులోని డబ్బులను కాజేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సెల్ ఫోన్లకు వచ్చే లింకులకు స్పందించకూడదు. లింకులను క్లిక్ చేస్తే డబ్బును సైబర్ నేరగాళ్లు కొట్టేస్తారు. సోషియల్ మీడియాలో పోస్టులు, లింకులు పట్ల జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్ రెడ్డి, సైబర్ సెల్ సీఐ

పశువైద్యసేవలను మెరుగుపరచాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ



ఏపీఎన్జీవీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

కడప రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువైద్యసేవలను మరింతగా మెరుగుపరిచి ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశహాలులో శుక్రవారం ఏపీఎన్జీవీఎఫ్ 2025 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ ఏపీఎన్జీవీఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన క్యాలెండర్, డైరీ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఆదే స్ఫూర్తితో అన్ని క్యాడర్ల ఉద్యోగులందరు కలిసికట్టుగా బాధ్యతగా పనిచేసి పశుపోషణదారులకు అందుబాటులో ఉంటూ శాఖ ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవిఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాంద్‌బాషా, నాయకులు సదాశివయ్య, బాబునాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివలక్షుమ్మ, వరదయ్య, పెంచల్రాజు తదితరులు ఉన్నారు.

ఏడుగురికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

- ఒక్కొక్కరు రూ.లక్షతో నమోదు



రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకున్న అట్లూరు మండల నాయకులు

అట్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై ఉన్న నమ్మకం, అభిమానంతో మండలంలోని ఏడుగురు టీడీపీ నాయకులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. శుక్రవారం బద్వేలులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకులు బోవిళ్ల నంద గోపాల్‌రెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, ఆరవ శ్రీనివాసులరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, పాలకొండు రామచంద్రారెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి టీడీపీ శాశ్వత సభ్య త్వం తీసుకున్నారు. ఈసందర్భంగా రితీష్‌రెడ్డి వారిని అభినందించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలోనే అట్లూరు మండలం సభ్యత్వ నమోదులో ముందంజంలో ఉందన్నారు. టీడీపీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.

బండలాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన చౌటిపల్లి ఎద్దులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్థులు

పులివెందుల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని ఉలిమెళ్ల గ్రామంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో చౌటిపల్లెకు చెందిన చంద్ర ఎద్దులు ప్రథమ బహుమతిని సాధించాయి. గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో చౌటిపల్లి గ్రామానికి చెందిన చంద్ర ప్రథమస్థానంలో నిలవగా మొదటి బహుమతిని కింద రూ. 50వేలు అందించారు. రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి 10వేలు నగదును గ్రామస్తులు విజేతలకు అందించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి 'సీమ' సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు రాయలసీమ సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో రాయలసీమ, బళ్లారితోపాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన 250మందికి పైగా కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురికి రాయలసీమ సంగీత రత్న, నృత్య రత్న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు వేదాంతం రామలింగ శాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జమునారాణి, వెంకటసుబ్రమణ్యం తదితరులు పాల్గొంటారన్నారు.

శేషవాహనంపై బ్రహ్మంగారి దర్శనం



ఆలయ పురవీధుల్లో శేషవాహనంపై ఊరేగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామివారు

బ్రహ్మంగారిమఠం, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మం గారిమఠం దేవస్థా నంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి శేష వాహనంపై దక్షిణ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జాము నుండే ఆలయం సింహ ద్వారం వద్ద వేచి ఉండి.. ద్వారాలు తెరవగానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాదశి మహోత్సవాలకు ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం గ్రామ పుర వీధుల గుండా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో వైవీయూ వీసీ



సదస్సులో వైవీయూ వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరగనున్న ఆలిండియా యూనివర్సిటీస్ సౌత్‌జోన్ వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ 2024-25లో యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి భాగస్వామ్యులయ్యారు. ఉన్నత విద్య భవిష్యత్తును రూపొందించడంలో భారతదేశం పాత్ర గురించి చర్చించడానికి దక్షిణభారత విశ్వవిదాయలయాల వీసీల భేటీలో వీసీ ఉన్నత విద్యాభివృద్ధిలో తన ఆలోచనలను పంచుకోనున్నారు. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రూబన్‌కుమార్ (హయ్యర్ అకడమిక్ గ్రేడ్) ఆధ్వర్యంలో 10,11 తేదీలలో జరిగే ఈ సమావేశాల్లో భారతదేశం అభివృద్ధి చెందుతున్న భారతావనిలో డిజిటల్ అవస్థాపనను విస్తరణ, ఆవిష్కరణలకు ప్రాధాన్యతపై చర్చిస్తారు. భవిష్యత్తులో ఉన్నత విద్య పరివర్తనాత్మక పాత్రను పోషించేలా ఆలోచనలు, అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడానికి కృషి జరుగుతుందని తెలిపారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఒక డైనమిక్ వాతావరణాన్ని ఈ సమావేశాలు అందిస్తాయని చెప్పారు. కొత్త సాంకేతికతతో నడిచే ప్లాట్‌ఫామ్‌లు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్‌పై దృష్టిసారించడం ద్వారా ప్రపంచ విద్యాధోరణులను రూపొందించడంలో కీలక పాత్ర పోషించే రెండు రోజుల పాటు చర్చలు సాగుతాయని.. అందులో వైవీయూ వీసీ ఆలోచనలను పంచుకోనున్నారు.

బొలేరో వాహనం ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ధనరాజ్ (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం సాయంత్రం సంఘటన జరుగగా రాత్రి ఆలస్యంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి స్కూటీపై వెళుతుండగా బొలెరోపికప్ వాహనం అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీకొట్టినట్లు చెప్పారు. సంఘటనలో తీవ్రంగా గాయపడిన ధనరాజ్ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టరు ఢీకొని గొర్రెలు మృతి

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని జడ్పీ బాలుర హైస్కూలు సమీపంలో ట్రాక్టరు గొర్రెల మందపై దూసుకెళ్లడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. శుక్రవారం రాత్రి గొర్రెల కాపర్లు రామయ్య, అయ్యప్ప మద్దిలేటిలు కమలాపురం నుంచి కుప్పూరువారిపల్లెకు గొర్రెలు తోలుకుని వస్తుండగా వెనుక వైపు నుంచి ట్రాక్టర్ వేగంగా వచ్చి గొర్రెలపై దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందగా.. మరికొన్ని గాయపడ్డాయని తెలిపారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని.. గొర్రెలే మా జీవనాధారమని, అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

బొప్పాయి మొక్కలు పీకేశారు..

- మహిళా రైతు ఆవేదన



రైల్వేకోడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీపీరాచపల్లెలో మహిళా రైతు సంగరాజు సరస్వతి ఐదెకరాల పొలంలో బొప్పాయి మొక్కలు నాటుకుంది. వీటిని కొందరు వ్యక్తులు గురువారం సాయంత్రం పెరికేశారని బాధితురాలు రైల్వేకోడూరులో శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలం నుంచి దారి కావాలని వేధింపులకు గురిచేస్తూ.. పొలంలో ఏ పంట వేసినా పీకేస్తున్నారని, కౌలుకు ఇచ్చినా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. గతంలో బొప్పాయి, అరటి చెట్లు కూడా పీకేశారని.. కూలీలను కూడా పొలంలోకి రానివ్వకుండా చేస్తున్నారని తెలిపారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయమని రెవెన్యూశాఖ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవ రి 10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పరిధిలోని నంద్యాలరోడ్డు బైపాస్ వెంకటాపురం సర్కిల్‌కు సమీపంలో ఆటో నడపుకొని జీవనం సాగిస్తున్న తుపాకుల వెంకటసుబ్బయ్య (50)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆర్లగడ్డ నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఇంటర్‌నేషనల్ ఫ్లోర్‌బాల్ క్రీడకు అజ్మతుల్లా



తల్లిదండ్రులతో అజ్మతుల్లా

కడప స్పోర్ట్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర గాంధీనగర్ పాఠశాలలో విద్యనభ్యసించే షేక్ అజ్మతుల్లా అనే విద్యార్థి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గత నెల 28, 29, 30 తేదీలలో జరిగిన జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో ఆంధ్రా జట్టు తరపున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు త్వరలో మలేషియాలో జరుగనున్నాయి. పేద విద్యార్థి అయిన అజ్మతుల్లా ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ మెడల్స్ సాధించారు. అయితే అజ్మతుల్లాకు ఆ పోటీలలో పాల్గొనే ఆర్థిక స్తోమత లేక మనోవేదనతో సతమతమవుతున్నాడు. కన్న తల్లిదండ్రులు సైతం కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ అజ్మతుల్లాను చదివించుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో కడప జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన కడప జట్టు

ముద్దనూరు జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు సంబంధించి అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. 9,10 తేదీల్లో రెండు రోజులు ఏపీ విద్యుత్ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

నెల్లూరు, కర్నూలు జట్ల విజయం



జాన్‌సన్ (నెల్లూరు), లలిత్‌ఇరగమ్‌రెడ్డి (చిత్తూరు), యశ్వంత్‌సూర్య (కర్నూలు)

కడప స్పోర్ట్స్, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో నెల్లూరు, కర్నూలు జట్లు విజయం సాధించాయి.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 35 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో పి.లలిత్‌ఇరగమ్‌రెడ్డి 61 పరుగులు చేశాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో జాన్‌సన్ 55 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు జట్టు బౌలర్ యశ్వంత్‌సూర్య 5వికెట్లు పడగొట్టి స్వల్పస్కోర్‌కే పరిమితం చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఉత్కంఠ పోరులో 29 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి ఎట్టకేలకు విజయం సాధించింది.. దీంతో కర్నూలు జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించినట్లయింది.

వేలం ద్వారా ఆదాయం రూ.19,47,000



గంగమ్మతల్లి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ తల్లికి వేలం ద్వారా వచ్చిన ఆదాయం రూ.19,47,000 అని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గంగమ్మ దేవాలయంలో తలనీలాలు, కొబ్బరికాయలు, విడిదినాల హక్కుల కోసం వేలం నిర్వహించారు. కాగా జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతిఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఫిబ్రవరి 28,29 తేదీల్లో జరిగే గంగమ్మ జాతరకు సంబంధించి తలనీలాలు, (వెంట్రుకలు సేకరణ), కొబ్బరికాయలు, టోల్‌గేట్, విడిదినాలు (ప్రతి ఆదివారం) హక్కులకు దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈవేలంలో టోల్‌గేట్‌కు రూ.5,70,000, కొబ్బరికాయలు రూ.6,30,000, విడిదినాలకు సంబంధించి తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) రూ.5,52000 వేలం దక్కించుకున్నారు. జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతి ఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఈ వేలం 17న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నగర రిమ్స్ సమీప శిల్పారామంలో చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా 5వేలు, 3వేలు, 2 వేల రూపాయల నగదు బహుమతులను అందజేస్తామన్నారు. మరో 20 మందికి కన్సోలేషన్ బహుమతులను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

క్రీడలు ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయి


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని డిప్యూటీ తహసీల్దారు రోషినా హుసేన్, కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మదర్ థెరిసా సేవా సమితి చారిటుబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి విజేత డిగ్రీ కాలేజీ టీంకు నగదు బహుమతి రూ.3వేలతో పాటు ట్రోఫీని, సర్టిఫికెట్లు నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ అందించారు. రన్నర్స్‌గా ఇంటర్‌కళాశాల విద్యార్థులు నిలవగా వారికి రూ.2వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీని సర్టిఫికెట్లు అందించారు.

భూములను పేదలకు పంపిణీ చేయాలి

వల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అర్జీదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి పేదకుటుంబానికి రెండు ఎకరాల సాగుభూమి హామీని వెంటనే అమలు చేయాలన్నారు. సాగుభూమితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు 3 సెంట్లు ఇంటిస్థలాన్ని పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి 2 సెంట్లు ఇచ్చే హామీని అమలు చేయాలని ఆ పార్టీ నేత గుంటి వేణుగోపాల్ అన్నారు.

ఈ నెల 11న ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారలుతో కలిసి తహసీల్దారు శ్రీవాణికి వినతిపత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, వెంకటలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు దక్కే వరకు పోరాటం

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేంత వరకు పోరాటాలు చేస్తుంటామని సీపీఐ కమలాపురం నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక కమలాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు పట్టణంలో 1 సెంటు ఇళ్లస్థలాలు, పట్టాలు ఇచ్చారని ఆ స్థలాలకు పట్టణాలకు నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కేటాయించారన్నారు. అందులో చాలా మంది పేదలకు ఇప్పటి వరకు ఇళ్లస్థలాలు చూపలేదన్నారు.

పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలి

సికెదిన్నె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కడప నగర కార్యదర్శి వెంకటశివ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె కార్యాలయం వద్ద శుక్రవారం రెండు సెంట్ల ఇంటిస్థలాల కోసం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందించారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు


దేవుని కడపలో స్వామివారి అలంకారం


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన జనం


కమలాపురం: రాధాక్రిష్ణ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని వైష్ణవాలయాలు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మూలవిరాట్ మూర్తులకు అభిషేకాలు, పూజలు చేశారు. చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయంలో తెల్లవారుజాము నుంచే మండల వ్యాప్తంగా ప్రజలు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ముక్కోటి ఏకాదశి కాబట్టి స్థానిక మల్లేశ్వరాలయం, నాగేశ్వరాలయాల్లో సైతం మూలవిరాట్ మూర్తులకు అభిషేకాలు జరిగాయి. అలాగే రామలింగ చౌడేశ్వరిదేవికి ప ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వర ఆలయంలో ఉదయం రామదాసు భక్త బృందంచే భజన కార్యక్రమం, గోవిందనామాలు, హనుమాన్‌చాలీసా, విష్ణు సహస్రనామ స్తోత్రాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుడికి గరుడ సేవ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధిలోని రైల్వే గేటు వద్ద వెలసిన రాధాక్రిష్ణమందిరంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమలాపురం పట్టణ ప్రాంతమే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ రాధాక్రిష్ణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి 8వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆలయం పైన రంగనాయకుల స్వామి కూడా ఉత్తరంవైపు వెలిశారని, ఇదంతా దైవ సంకల్పంగానే భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మండల టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దాది రా మయ్య, చిన్నసుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, గుజ్జుల నారాయణ పాల్గొన్నారు.

మోక్ష నారాయణస్వామి ఆలయంలో...

మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. మహాలక్ష్మి మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత ద్వికంధర షణ్ముఖ సుబ్రమణ్యేశ్వర స్వామి వెలసిన ఈ ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. తెల్లవారుజామున 4గంటలకే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, ఆలయ ప్రాంగణ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా గంధంతో అలంకరణ చేశారు. కమలాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పోచంరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వల్లూరులో...

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి ఆ ద్వారం గుండా లోపలికి రాగానే చెన్నకేశవస్వామి గరుడ వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే వల్లూరు, పైడికాల్వలో ఉన్న చెన్నకేశవ ఆలయాల్లో తెల్లవారుజామునే పంచాభిషేకాలు నిర్వహించారు.


పుష్పగిరి కొండపై ఉత్తర ద్వారం ఏర్పాటు


చెన్నూరులో ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి

'పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి'


అంజద్‌బాషాను సత్కరిస్తున్న వైసీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలో ఆయన్ను వైసీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటకృష్ణ, చాన్‌బాషా, జిల్లా సెక్రటరీ టక్కోలి రమేష్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, ఎస్.అజ్మతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరంగనాథుని కల్యాణం

పులివెందుల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పులివెందులలో వెలసిన శ్రీరంగనాధస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు క్రిష్ణస్వామి, పల్లి క్రిష్ణరాజశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 3గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరెడ్డి తన కు టుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈవో వెంకటరమణలు ఆలయ మర్యాదలతో జడ్జి చంద్రశేఖర్‌రెడ్డికి ఆహ్వానం పలికారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్ రోడ్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని పింఛనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట జరిగిన దేశవ్యాప్తం పిలుపులో భాగంగా జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పింఛనర్లకు క్యాష్ మెడికల్ బెనిఫిట్, ఏకరూప డీఏ చెల్లించాలన్నారు. మాజీ సైనికులకు, ఇంజనీర్లకు పింఛన్ పథకం కోరుకునే అవకాశం ఇవ్వాలన్నారు. సంఘం నాయకులు శంకర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, అజయ్, కస్తూరి, పక్కీరయ్య, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవితా పోటీల విజేతలకు బహుమతులు


విజేతలతో మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల మహాసభల్లో భాగంగా వచ్చే ఫిబ్రవరి 8, 9, తేదీలలో స్థానిక ఐఎంఏ హాలులో కవితా పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సూర్యరావు ఆధ్వర్యంలో జిల్లా రచయితల సంఘం సభ్యురాలు పెద్దిరెడ్డి నీలవేణి, తెలుగు అధ్యాపకుడు ఎం.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కవితాపోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం-పరిరక్షణ అనే అంశంపై సుమారు 100 మందికి పైగా విద్యార్థినులు, మహిళలు పాల్గొని కవితలు రాశారన్నారు. ఇందులో వి.ప్రహర్షిత, షేక్ ఆయేషా, విజయశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. మహాసభల్లో ఆయా కవితలు వినిపిస్తారన్నారు. కార్యక్రమంలో రచయిత డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరరాచారి, శ్రీవాణి, అరుణకుమారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

వేముల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రమైన వేములలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ క్రికెట్ పోటీలనుటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆల్‌దబెస్ట్ చెప్పారు. గెలుపు ఓటముల మధ్య తేడా ఉండవని అందరు కలిసికట్టుగా ఉండాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీనాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప నాగరాజుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నగర అధ్యక్షుడు చంద్రరెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. సుంకర రవి, ప్రకాష్, కిరణ్‌కుమార్, దస్తగిరి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

స్టెప్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం

కడప నాగరాజుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్టెప్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతినిపురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవ వేడుకలు శుక్రవారం కడపలోని హజరత్ ఆయేషా జూనియర్ కళాశాలలో నిర్వహించినట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ తెలిపారు. స్వామి వివేకానంద చిత్రపటటానికి పూలమాల వేసి నిబాళులు అర్పించారు.

కడప నగర వైసీపీ అధ్యక్షుడిగా అంజద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప నగర అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

వేంపల్లెను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- సీసీరోడ్డు పనులను ప్రారంభించిన బీటెక్ రవి


వేంపల్లెలో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, గ్రామసీమల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. వేంపల్లెలోని ఇమాంనగర్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7.50లక్షలతో నిర్మించిన సిమెంటురోడ్డును శుక్రవారం బీటెక్‌రవి ప్రారంభించారు. ఎంపీడీఓ కుళాయమ్మ, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీడైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర నాయకులు జగన్నాథరెడ్డి, యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, నామా వేమకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పలువురు బీటెక్ రవికి తమ సమస్యలను చెప్పుకొన్నారు.

ఉరుసును విజయవంతం చేయండి

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్‌లోని హుజ్రా మస్జిద్ కే ఖరీబ్‌లో వెలసిన పురాతన చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ షా గౌస్ సర్మద్ ఖాద్రీ దర్గా 186వ ఉరుసును ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా ఇలియాస్ బాషా ఖాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక రవీంద్రనగర్‌లోని ఆ దర్గా ఆవరణంలో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్స్‌ను పీఠాధిపతి ఆవిష్కరించారు.15వ తేదీ సాయంత్రం 7 గంటలకు గంధం మహోత్సవం కన్నుల పండువగా జరుగనుందన్నారు. 16 సాయంత్రం ఉరుసు మహోత్సవం ఘనంగా జరుగనుందన్నారు. రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ మైనార్టీ విభాగ నాయకులు జిలానీబాషా, దర్గా కమిటీ ప్రతినిధులు అక్బర్ అలీమౌళీసాబ్, అహ్మద్‌సాబ్, మహ్మద్, పి. అన్వర్‌బాషా, ఎస్.మహ్మద్ అలీం,గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'శాంతినికేతన్'లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



భోగిమంటల వద్ద పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలలో ఉత్సాహంగా భోగిమంటలు వేశారు. తర్వాత ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు అందరు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు ఎస్.ఎలియాస్‌రెడ్డి విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశేషాలను వివరించారు. ముగ్గుల పోటీల విజేతలైన వారికి పాఠశాల డైరెక్టర్ ఫిలోమినా చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులందరు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న న్యాయవాది రామ్మోహన్, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రముఖ న్యాయవాది రామ్మోహన్ కార్యాలయంలో శుక్రవారం రాయల్ కరిముల్లా సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన స్వామి వివేకానంద పోస్టర్‌ను న్యాయవాది రామ్మోహన్ (అపుస్మ), రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఆమట్లాడుతూ ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పోస్టర్‌ను విడుదల చేయడం అభినందనీయమన్నారు.

వృషభాచలేశ్వరుడికి పూజలు


వేంపల్లెలో పూజలందుకుంటున్న వృషభాచలేశ్వరస్వామి

వేంపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పాపాఘ్ని నదీ ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశి పూజలు వేడుకగా నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకన్నను ఫలాలతో అలంకరించి పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ఉత్తరద్వారం ఏర్పాటుచేయగా భక్తులు ఉత్తరద్వారం గుండా వెళ్లి స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

సింహాద్రిపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి) తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైనట్లు రీజనల్ ప్రెసిడెంట్ పరుశురామయ్య తెలిపారు. శుక్రవారం పులివెందులలో కడప రీజియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యుడిగా పులివెందుల డివిజన్ ప్రెసిడెంట్‌గా దుర్గాప్రసాద్, డివిజన్ వైస్‌ప్రెసిడెంట్‌గా విజయకేశవులు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామిరెడ్డి, డివిజన్ సెక్రటరీగా దామోదర్, అడిషనల్ సెక్రటరీగా పీవీ రమణారెడ్డి, ట్రెజరర్‌గా సాంబశివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులుగా జగదీశ్వర్‌రెడ్డి, అనూరాధ, వి.వి.రమణ ఎంపికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవిని కలిశారు. నూతన కార్యవర్గంలో 20 మంది చేరినట్లు తెలిపారు. కడప డివిజన్ సెక్రటరీ శ్రీనివాసులు, రీజనల్ సెక్రటరీ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేదే సంక్రాంతి



వైష్ణవి ఇంగ్లీషు మీడియం స్కూలులో సంప్రదాయ పద్ధతిలో విద్యార్థులు

పోరుమామిళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మనదేశ సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేప్పేదే సంక్రాంతి పండుగ అని వైష్ణవి స్కూలు కరస్పాండెంట్ రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రకరకాల ముగ్గులతో ఆ పాఠశాల ఆవరణమంతా అలంకరించారు.అలాగే విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దులు, బుడబుక్కల వేషధారణలతో అకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆర్.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ కళ్యాణి, పాఠశాల బృందం పాల్గొన్నారు. అలాగే వెంగమాంబ హైస్కూలులో డైరెక్టరు పుల్లపనాయుడు, కరస్పాండెంట్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణలతో అకట్టుకున్నారు.



వెంగమాంబ స్కూలులో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఎంత ఉన్నతస్థాయికి చేరుకున్నా సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారని పేర్కొన్నారు. కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతగానో శ్రమించి గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేసి వేడుకలను చక్కగా నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగోలి, కోలాటం, వస్త్రాలంకరణ, పిండివంటల పోటీలు, చెక్కభజన, ఫొటోగ్రఫి, చిత్రలేఖనం, బొంగరాలు, హరిదాసు కీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేది

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి



మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం తాళ్ళమాపురం పొలంలోని సర్వేనెంబరు 76లో ఉన్న 26 ఎకరాల చెరువు భూమిని ఏడబ్ల్యూ ల్యాండుగా మార్చినట్లు ఆర్ఎస్ఆర్‌లో నమోదు కాలేదని అందువల్లే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆభూమిని పరిరక్షించడంకోసం అభ్యంతర పెట్టారని దానిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాపై అవినీతి ఆరోపణలు చేయడం అతనికే చెల్లని టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1985 నుంచి ఎమ్మెల్యేగా వున్న వరదరాజులరెడ్డికి అదిచెరువు అని కానరాలేదా అని రాచమల్లు ప్రశ్నించారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన భూ అక్రమాలపై ఫిర్యాదుల్లో భాగంగానే ఆ చెరువు భూమిపై అభ్యంతర పెట్టారన్నారు. రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్న రాచమల్లు కిరణ్‌రెడ్డికి అందులో 6 ఎకరాలకు పైగా వాటావుందని నిమ్మకాయల సుధాకర్‌రెడ్డికి క్లియరెన్సువస్తే తమ పని సులవవుతుందని ఈ ఎత్తుగడ వేశారన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి గానీ మరో వ్యక్తి గానీ ఆ భూమి విషయమై డబ్బులు ఇస్తామనే ప్రతిపాదనే మా దగ్గరకు రాలేదని మేము నమ్మే రాధాస్వామి సాక్షిగా ప్రమాణ పూర్వకంగా చెబుతున్నామన్నారు. రాచమల్లు పాలనలోనే ప్రొద్దుటూరులో మట్కా జూదం, క్రికెట్ బెట్టింగ్‌లను వ్యవస్థీకృతం చేశారన్నారు. తన ఇంట్లోనే జూదం ఆడించి మేజు తీసుకోలేదని రాచమల్లు ప్రమాణం చేయగలడా అని ప్రశ్నించారు. టెండర్ల విషయంలో మాత్రం మాకార్యకర్తలకు రావడం కోసం జోక్యం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి , ఘంటశాల వెంకటేశ్వర్లు , వంగనూరు మురళీధర్‌రెడ్డి, తలారిపుల్లయ్యపగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తివిశ్వాసాలతో భగవంతుడిని ప్రార్థించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భక్తి విశ్వాసాలతో భగవంతున్ని ప్రార్థించాలని లండన్‌కు చెందిన ఇస్కాన్ దీక్షా గురువు భగవద్గీత ప్రచారకుడు శ్రీమద్ వేదవ్యాస ప్రియస్వామి మహరాజ్ పేర్కొన్నారు. ఇస్కాన్ మందిరంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు వెన్నలడ్డూ ప్రసాదం అందజేశారు. శ్రీకృష్ణుడు, బలరాముడు విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. ఇస్కాన్ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



ప్రొద్దుటూరు.. పుష్పాలంకరణలో చెన్నకేశవస్వామి



జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



మైదుకూరులో తిరుమలనాథస్వామి

జమ్మలమడుగు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తులు బారులుతీరారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకే ప్రత్యేక పూజలు చేసి దైవదర్శనం కోసం భక్తులకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున పాత మార్కెట్‌లోని పార్వతీ సమేత చెన్నకేశవస్వామి ఆలయం, బొల్లవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆశీనులను చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కొండాపురం..: మండలం లో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపురం పాత ఊరి రామాలయంతో పాటు పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులోని మాధవరాయస్వామి ఆలయం, తిరుమలనాథ స్వామి ఆలయం,వనిపెంట చెన్న కేశవస్వామి ఆలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామిని దర్శ నం చేసుకొనేందుకు భక్తులు విరివిగా పాల్గొన్నారు.భక్తులు ముందుగా ఉత్తర ద్వారం గుండా వెళ్లి స్వామి దర్శనం చేసుకొన్నారు.

ఎర్రగుంట్ల..: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే చిలమకూరు లోని శ్రీగోదామహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆల యంలో అర్ధరాత్రి నుంచి అభిషేకం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనాన్ని కల్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏడు ద్వారాలు ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల పద్మావతినగర్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి అభిషేకాలు నిర్వహించారు.

దువ్వూరు..: దువ్వూరు మండలంలో వైకుంఠ ఏకాదశి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాతదువ్వూరులోని రామదండు ఆలయం,వేణుగోపాలస్వామి, నాగులకట్ట శివాలయం, శ్రీలలితా జ్యోతిషాలయంతో ప్రత్యేక అలంకారాలు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోదండ రామాలయంలో తెల్లవారుజాము నుంచి వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు.

ముద్దనూరు..: మండలంలోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.శ్రీచెన్నకేశవస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక వైకుంఠ ద్వారాలు ఏర్పాటు చేశారు. మూల విరాట్‌లను ప్రత్యేక అలంకరణ చేశారు.భక్తులు వైకుంఠ ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సాదు చెన్నారెడ్డి స్వామికి పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాదు చెన్నారెడ్డి శిష్యబృందంచే హరిభజనలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10 వరకు రెడ్డివారిపల్లె గ్రామస్తులచే భారీ సెట్టింగులతో కోలాట భజన నిర్వహించారు. 11గంటల నుంచి శ్రీ సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులకు సాదు కేశవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఖాజీపేట..: శుక్రవారం వైకుంఠ ఏకాదశి రావడంతో కోటంగురాయుపల్లెలోగల వేంకటేశ్వస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే సుఖసంతోషాలతో ఉంటారని వారు నమ్మకం.

బద్వేలు రూరల్..: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నెల్లూరురోడ్డు తదితర వేంకటేశ్వరస్వామి ఆలయం, వల్లెలవారిపల్లె గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారికి తిరుకళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణకైంకర్యం పట్టణంలోని మైదుకూరురోడ్డులో ఉన్న వెరైటీషూమార్ట్ ప్రొప్రైటర్ సోమిశెట్టి భాస్కర్ దంపతులు నిర్వహించగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన యాదాళ్ల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయనిర్వాహకులు





ఎర్రగుంట్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, బీ కోడూరు..రెడ్డివారిపల్లె గ్రామస్థులు కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతి పేదవానికి ఇంటిస్థలం ఇవ్వాలి



బద్వేలులో ధర్నా చేస్తున్న నాయకులు

బద్వేలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి పేదవాడికి పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.వీరశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు భూమి పంపిణీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగదాసరి ఇమ్మానుయేల్, బాలు, వెంకటరమణ, మహిళా సంఘం నాయకురాళ్లు విజయమ్మ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ప్రతి పేదవానికి ఇంటిస్థలం,అర్హులకు సాగు భూమి, ఇంటి పట్టాలు దక్కేంత వరకు పోరాటం ఆగదని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండలకార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోరుమామిళ్లలోని అంబేడ్కర్ సర్కిల్, తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గోపవరం..: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సెంట్లు ఇంటిస్థలంతో పాటు రెండు ఎకరాలు సాగుభూమి ఇవ్వాలని సీపీఐ మండల సమితి డిమాండ్ చేసింది. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో శుక్రవారం. ధర్నా కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలోమండల సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యులు పీవీ రమణ, సీపీఐ మండల కార్యదర్శి గూడూరు పెంచల య్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: అర్హులైన పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వాలని శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దారు రూపేష్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జమ్మలమడుగు కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటరమణ, మధు, శ్రీనివాసులు, గురుస్వామి, నాగరాజు, ఏఐవైఎఫ్ నాయకులు రాంప్రసాద్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల మేర ఇంటి స్థలాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పేదలు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి సుబ్బరాయుడు, మచ్చ శ్రీను వీరయ్య శెట్టి, హరి ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, రాహుల్, నాగేంద్ర పాల్గొన్నారు.

విజయానంద్‌ను కలిసిన ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు ,జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కలిసి శుభా కాంక్షలు తెలిపారు. విజయా నంద్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విజయ వాడలోని ఆయన కార్యాల యానికి వెళ్ళిన వరదరాజుల రెడ్డి ఆయనను శాలువతో సన్మానించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పోరుమామిళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ రామిరెడ్డితో కళాశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు కొండ రామక్రిష్ణారెడ్డి, రామసుబ్బారావు. సీతా వెంకటసుబ్బయ్య ఇమాంహుసేన్, ఎంపీటీసీ కల్వకూరి రమణ, సెట్టెం ప్రతాప్, ఎంపీడీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

వాసవీమాతకు దీపాలంకరణ సేవ



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారిశాలలో అమ్మవారికి దీపాలంకరణ సేవ శోభాయమానంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు గర్భగుడిలో దీపాలంకరణ సేవ చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారిని వజ్రపుచీరె, కిరీటం, రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యాయుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

బద్వేలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గత సమ్మెకాలపు ఒప్పంద జీవోలను పరిష్కరించాలంటూ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శికె. శ్రీనివాసులు ప్రారంభించారు. నిరాహార దీక్షలో పోలయ్య, ప్రవీణ్‌కుమార్, సత్యరాజు, వెంకటేశ్వర్లు, వంశీ, నారాయణ, రామయ్య, పెంచలయ్య , ఓబయ్య, రామసుబ్బయ్యలు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, కార్మిక సంఘం యూనియన్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, శ్యాంప్రవీణ్, హరీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీలు రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఈబీసీలకు రాయితీ రుణాలు ప్రభుత్వం అందించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీతో బీసీ, ఈబీసీలకు రాయితీ రుణాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వెనకబడిన కులాల్లోని ఏ, బీ, డీ,ఈ వర్గాలు రుణ సౌకర్యం పొందేందుకు అర్హులన్నారు. రూ.2లక్షలు, 3 లక్షలు, ఐదు లక్షలను బ్యాంకు లింకేజీతో రుణాలు పొందవచ్చన్నారు. వారు వరుసగా 75వేలు, లక్షా 25వేలు, 2 లక్షలు రాయితీ ఉంటుందన్నారు. జనరిక్ మెడికల్ షాపు దరఖాస్తుకు రూ.8లక్షలు రుణ సౌకర్యం ఉంటుందని అందులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఓబీ, ఎంఎంఎస్ సైట్ ద్వారా ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్, ఈబీసీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

అట్లూరు..: బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ బ్యాంకు లింకేజీతో బీసీలు ఏ, బీ, డీ ,ఈ వర్గాలు, ఈ.బీసీ వారికి ప్రభుత్వం రుణాలు కల్పించడం జరిగిందని ఎంపీడీవో భాస్కర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు రూ.2లక్షలు, 3 లక్షలు, ఐదులక్షలు సబ్సిడీ రూ.75వేలు, ఒక లక్షా 25వేలు, రూ.2లక్షలు సబ్సిడీతో రుణాలు పొందవచ్చని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనేందుకు వెసులుబాటు ఉందని ఈ నెల 16తేదీ లోపు గడువు పూర్తవుతుందని ఆయన తెలిపారు. దరఖాస్తు వెంట క్యాస్ట్, ఈబీసీ సర్టిఫికెట్లు జత పరచవలెనని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఖాజీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం సందర్భంగా సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్, లైన్లు మరమ్మతుల కోసం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అన్నారు.

మినీ గోకులాలు ప్రారంభం

దువ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన గోకులాలను శుక్రవారం ఆరుచోట్ల ప్రారంభించారు. దువ్వూరు, ఇడమడక, క్రిష్ణంపల్లె గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రామక్రిష్ణయ్య, ఏపీవో వసంతకుమార్, వెటర్నరీ డాక్టర్, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు..: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులాలను శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మడూరు, అన్నవరం, భద్రిపల్లె, అల్లాడుపల్లె, చాపాడు, భూమాయపల్లె, పల్లవోలు, నాగులపల్లె గ్రామాల్లో రైతులు మినీ గోకులాలను నిర్మించుకున్నట్లు ఉపాధి ఏపీవో జగదీష్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన దేవగుడి



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఎంసీ మైదానంలో సీఎస్ఐ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవగుడి నారాయణరెడ్డి హాజరై ప్రసంగించారు. అనంతరం చర్చి ఫాదర్లు, డీఎస్పీ వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. సీఐ లింగప్ప, టోర్నమెంట్ నిర్వాహకులు వై.కె.కిరణ్, విజయ్, మనోహర్, కూటమి నాయకులు సంతోష్, మోరగుడి రాజా, తదితరులు పాల్గొన్నారు.